క్లుప్తంగా

ఆటిజం సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు

అమలాపురం టౌన్: పట్టణంలో దివ్యాంగుల విద్యార్థుల కోసం ఆటిజం సెంటర్ ఏర్పాటుకు జిల్లా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ పట్టణంలో పర్యటించి సన్నాహాలు చేశారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించి ఆటిజం సెంటర్ ఏర్పాటుకు అనువైన గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఆటిజం సెంటర్ ఏర్పాటుకు సంబంధించి డీఈవోకు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ పాఠశాలలో ఆటిజం సెంటర్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు ఎన్.సత్యవతి, ఐఆర్పీలు శ్రీం.శ్రీనివాసరావు, జి.నానాజీ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను గుర్తించాలి



భీమనపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మమ్మీ

ఉప్పలగుప్తం: బడి ఈడు పిల్లలను గుర్తించి వారి వివరాల నమోదును వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ సిబ్బందికి సూచించారు. మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రివ్యూ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజన భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష బాలిక సంరక్షణ అధికారి ఏపీఓ ఎంఏకే భీమారావు, హెచ్ఎం ఎన్.సత్యనారాయణ, పీడీ కామన మధుసూధన్‌రావు, అరవ స్వామినాయుడు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

మహిళా సర్పంచ్‌లకు డీపీఓ పిలుపు

అమలాపురం రూరల్: మహిళా సర్పంచ్‌లు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని డీపీఓ ఎం.శాంతలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని 270 మంది మహిళా సర్పంచులకు పాలనపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. 'మార్పు ద్వారా విజేతలు – మహిళా సాధికారితతో స్వపరిపాలన సాధ్యం' అనే అంశంపై రెండో బ్యాచ్‌కు మూడు రోజుల శిక్షణ ఇచ్చారు. ఈ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను పాలన, గ్రామాల అభివృద్ధిలో వినియోగించాలని డీపీఓ కోరారు. డీఎల్‌పీవో బొబ్బిరాజు, ఎంపీడీవో ఉండ్రు బాబ్జీ రాజు, ఫ్యాకల్టీ శ్రీనివాసరావు, నాగేంద్ర సుబ్రహ్మణ్యం, అనంతలక్ష్మి, రాజశ్రీ, సుధారాణి, ప్రభాకర్ సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

అమలాపురం రూరల్: అమలాపురం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఆకుమర్తి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కేబీ స్రామాట్ మధు మాదిగ, కోఇన్‌చార్జి డాన్ సూరి మాదిగ, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నవరపు భైరవమూర్తి సారథ్యంలో అమలాపురం రూరల్ మండలం ఉప్పలగుప్తం మండలం, అల్లవరం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మూడు మండలాలు యువసేన అధ్యక్షుడు ఏకాభిప్రాయంతో అమలాపురం నియోజకవర్గం కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ అధ్యక్షుడు ఆకుమర్తి మోహన్, నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందా రామకృష్ణ, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల అధ్యక్షులు చుట్టుగుళ్ల సత్తిబాబు, సత్తాల దుర్గారావు, యార్లగడ్డ రామకృష్ణ, దండోరా సీనియర్ నేత చుట్టుగుళ్ల నీలకంఠం పాల్గొన్నారు.

మద్యం షాపు సీజ్

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన గేట్ సెంటరులో సూర్యమోహన్ మద్యం షాపుపై ఎక్సైజ్ అధికారులు దాడి చేసి మద్యం లూజు అమ్మకాలను అడ్డుకుని పర్మిట్ రూమ్‌ను, మద్యం షాపును సీజ్ చేసారు. నాణ్యత లేని మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదుపై ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు దాడి చేసారు. ముమ్మిడివరం ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ అనధికారిక పర్మిట్ రూమ్‌లో మద్యం లూజు అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. మద్యం శాంపుళ్లు సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు.

వైద్యుల ఎంపిక జాబితా విడుదల

యానాం: స్థానిక రీజియన్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో మే 13, 27 తేదీల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైన 24 మంది వైద్యుల జాబితాను శుక్రవారం రాత్రి పుదుచ్చేరి హెల్త్ సొసైటీ మిషన్ డైరెక్టర్ ఎస్ గోవిందరాజన్ విడుదల చేశారు. పలువురుని వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచారు. మైక్రోబయోలజిస్ట్, ఏఎన్ఎమ్, స్టాఫ్‌నర్సులు, ఫిజియోథెరపిస్ట్, యోగా డెమోన్‌స్ట్రేటర్, డయాలసిస్, ఈసీజీ టెక్నీషియన్ పోస్టులకు ఎంపికైనవారి జాబితాను ఈ సందర్భంగా విడుదల చేశారు.

ఉత్తమ పద్ధతులతో సాగుదాం

- ఖరీఫ్‌లో అనువైన వరి రకాలు సాగు చేయాలి
- అధిక దిగుబడిపై దృష్టి సారించాలి
- అమలాపురం సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు షంషి సూచన
- ఖరీఫ్ సీజన్‌లో నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు



అమలాపురం మండలం నడిపూడిలో నారుమడి



వ్యవసాయ సహాయ సంచాలకుడు షంషి

అమలాపురం రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. తొలకరి పలకరించడంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో కొంతమంది రైతులు ఉప్పటికే నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. జూన్ 1న ప్రభుత్వం కాలువల ద్వారా నీటిని విడుదల చేసినా నడిపూడి, ఈదరపల్లి వంతెనల నిర్మాణ వల్ల కాలువలకు నీరు 20 రోజులు ఆలస్యంగా రావడంతో అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో నారుమడులు వేసుకోలేదు. అమలాపురం నియోజకవర్గంలో సుమారు 21వేలు ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. కాలువుకు నీరు వచ్చి వారం రోజులు కావడంతో రైతులు నారుమడులు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ సమయంలో ఖరీఫ్ సీజన్‌లో అనువైన రకాలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించేందుకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలు పాటించాలని అమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎంఏ షంషి సూచించారు. ఖరీఫ్‌లో అమలాపురం నియోజకవర్గంలో రైతులు సాగు చేసే వరి విత్తన రకాలు, తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యల వివరాలను ఆయన తెలియజేశారు.

ఎంటీయూ 1318

సార్వాలో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 వరి రకాన్ని మార్టేరు వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇది నూతన వరి వంగడం. దీని పంట కాలం 155–160 రోజులు, స్వర్ణకు ప్రత్యామ్నాయం. తెగుళ్లను తట్టుకుంటుంది. ముఖ్యంగా పాము పొడ తెగులు, దోమపోటు అగ్గితెగులును తట్టుకోవడమే రాకుండా ప్రకృతి వైపరీత్యాల సమయంలో గాలులకు ఒరిగిపోకుండా అధిక దిగుబడినిస్తుంది. నీటి వసతి అధికంగా ఉన్న ప్రాంతాల రైతులు ఈ వరి వంగడాన్ని సాగు చేయాలి.

ఎంటీయూ 7023 (స్వర్ణ)

50 శాతం మంది రైతులు ఎక్కువగా ఖరీఫ్‌లో ఈ రకాన్నే సాగు చేస్తున్నారు. ఈ రకం పైరు 155 రోజులకు కోతకు వస్తుంది. అధిక గాలులు, వర్షాలకు పడిపోయే స్వభావంతో పాటు తెగుళ్లను అంతగా తట్టుకోకపోయినా ఇది ఎటువంటి పరిస్థితుల్లోనైనా దిగుబడి బాగా ఇస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా దీని వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ రకం ఎకరాకు 30–35 బస్తాల దిగుబడి వస్తోంది.

బీపీటీ 5204 (సాంబమసూరి)

బీపీటీ 5204 (సాంబమసూరి) సాంబమసూరి వంట కాలం 155 నుంచి 160 రోజులు. ఇది సన్నరకం ఫైన్ క్వాలిటీ. మన ప్రాంతంలో రైతులు ఎక్కువగా వారి తిండి అవసరాల కోసం దీన్ని పండిస్తారు. దీనికి బ్యాక్టీరియా ఎండు తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా దీన్ని సాగు చేయడం లేదు. ఎంటీయూ 1061 (ఇంద్ర)

స్వర్ణ రకం మాదిరిగానే 150 నుంచి 155 రోజుల్లో పంట వస్తుంది. ముంపు ప్రాంతాల్లో దీన్ని సాగు చేసుకోవచ్చు. ఎందుకంటే ఎక్కువ రోజులు నీటిలో ఉన్నా పంటకు నష్టం ఉండదు. వర్షాలు గాలికి పడిపోయే గుణం తక్కువ. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా దీన్ని సాగు చేసుకుంటే మంచిది.

ఎంటీయూ 1064

తొలకరిలో స్వర్ణకు ప్రత్నాయ్నాయంగా తయారు చేసిన రకం పంట కాలం 145 రోజులు 150 రోజులు ఎకరాకు 25 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తుంది. స్వర్ణకు దీటుగా దిగుబడిని ఇస్తుంది. ముంపు ప్రాంతాలకు కూడా ఇది అనువైన రకం. ఈ రకం సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

ఎంటీయూ 1075

ఈ వరి ఎక్కువ పొడవుగా ఎదుగుతుంది. పడిపోయే గుణం తక్కువ. దీని పంట కాలం 145 నుంచి 150 రోజులు. దిగుబడి ఎకరాకు 25 నుంచి 28 బస్తాల వరకు వస్తుంది.

ఎంటీయూ 1121

ఇది ఫైన్ క్వాలిటీ సన్న రకం. దీని పంట కాలం 150 రోజులు, ఇది కొంత వరకు దోమను తట్టుకుంటుంది. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది. ఎక్కువ రకాలు ఉన్న అమలాపురం నియోజకవర్గంలో 75 శాతం మంది రైతులు ఎంటీయూ 1318 వరి రకాన్ని సాకు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో గాలులకు ఒరిగిపోకుండా అధిక దిగుబడినిస్తుంది. నీటి వసతి అధికంగా ఉన్న ప్రాంతాల రైతులు ఈ వరి వంగడాన్ని సాగు చేయాలి.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: దోమల ఉధృతి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటి నివారణకు నగర పంచాయతీలో ప్రత్యేక నిధులు కేటాయించి తక్షణ చర్యలు చేపట్టాలని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వర్షాలు కురవడంతో దోమల దాడి పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని గగ్గోలుపెడుతున్నా అధికారులు స్పందించడం లేదని ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ కమిషనర్ పి.రవివర్మను నిలదీశారు. నిధుల లేమితో చర్యలు చేపట్టలేదని ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజీవ్ వివరించారు. చైర్మన్ కమిడి ప్రవీణ్ స్పందిస్తూ దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమ లేఅవుట్లు వేస్తూ మురుగునీటి డ్రైన్లు, పంట బోదులను మూసి వేస్తున్నారని ములపర్తి బాలకృష్ణ తెలిపారు.దీనిపై కమిషనర్ రవివర్మ మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. చిప్పలపాలెంలో 9 ఎకరాల చెరువు ఉండగా నాలుగు ఎకరాలు ఆక్రమణకు గురైందని, కొబ్బరి చెట్లు అన్యాక్రాంతమయ్యాయని 14వార్డు కౌన్సిలర్ సరిపెల్ల రామకృష్ణంరాజు వివరించారు. వైస్ చైర్మన్లు రెడ్డి హేమ సుందరి, వేటుకూరి బోసు రాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: జూలై 9న చేపట్టబోయే కార్మికుల సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు, మున్సిపల్ కార్మికుల గౌరవాధ్యక్షుడు కె.సత్తిబాబు పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని జూలై 3న అమలాపురంలో నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన పారిశుధ్య కార్మికులతో ఆయన చర్చించారు. ఈనెలాఖరున విజయవాడలో నిర్వహించే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియర్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరుగుతుందని సత్తిబాబు వెల్లడించారు. అమలాపురంలో మెరుగైన పారిశుధ్యం కోసం అధికారులకు యూనియన్ తరపున సహకారం అందించాలని సత్తిబాబు స్పష్టం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

అమలాపురం టౌన్: స్థానిక వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు మామిడికుదురు మండలం పాశర్లపూడి రామ్ గంగా ట్రస్ట్ వారు రూ.50 వేల విలువైన ఫర్నిచర్ (చైర్లు, టేబుళ్లు) వితరణగా సమకూర్చారు. ఇదే పాఠశాలలో ఇంగ్లిషు స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.లక్ష్మీ తులసి ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. హైదరాబాద్ కేంద్రంగా రామ్ గంగా ట్రస్ట్ చైర్మన్ బి.రామ్ గంగాధరరావు అంతర్జాతీయంగా అనేక సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్నారని లక్ష్మీ తులసి తెలిపారు. ఈ ఫర్నిచర్‌ను పాఠశాలలో శుక్రవారం ట్రస్ట్ ప్రతినిధులు డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, వార్డు కౌన్సిలర్ పిండి అమరావతి, ప్రధానోపాధ్యాయుడు కె.సత్యనారాయణ తదితరులకు అందజేశారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మలిశెట్టి వీరాస్వామి, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, పీవీఎల్ఎస్ శ్రీరామ్, కేఆర్ఎస్ ప్రసాద్, బి.రామకృష్ణ, పిండి రాజా పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడుతున్న వీఓఏ చర్యలేవీ?

- మండల సమావేశంలో సభ్యుల రగడ
- ఏపీఎంను నిలదీసిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో ప్రొటోకాల్‌పై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చినబాబు నిలదీస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం రూరల్: డీఆర్డీఏలో పనిచేస్తున్న వీఓఏలు ప్రతి పనికీ ఒక రేటును పెట్టేశారని ఉన్నతాధికారులకు ఇవ్వాలంటూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నా డీఆర్డీఏ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి మండిపడ్డారు. అమలాపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. వీఓఏల (యానిమేటర్లు) తీరును సభ్యులు నిలదీసి, చర్యలు తీసుకోవాలంటూ పట్టుబట్టారు. ఏపీఎం సత్యనారాయణ మాట్లాడుతుండగా వీఓఏలు తీరుపై ఎంపీపీ జోక్యం చేసుకుని ధ్వజమెత్తారు. పేరు అప్‌లోడ్ చేయాలంటే రూ. 500 ఇవ్వాల్సిందేనంటూ మహిళలను యానిమేటర్లు డిమాండ్ చేస్తున్నారని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పనికీ ఒక రేటును ఫిక్స్ చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. ఎంపీపీకి పేరూరు ఎంపీటీసీలు చొల్లంగి సుబ్బిరామ్, దొంగ ఆంజనేయులు కామనగురువు ఎంపీటీసీ-2 సునీత, బండారులంక సర్పంచ్ పెనుమాల సునీత తదితరులు మద్దతు తెలిపారు. దందాకు పాల్పడుతున్న యానిమేటర్లపై చర్యలు తీసుకుంటామని ఏపీఎం సత్యనారాయణ బదులిచ్చారు. ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చినబాబును ఎంపీపీ, జెడ్పీటీసీలు ప్రశ్నించారు. ఈదరపల్లి, నడిపూడి బ్రిడ్జిల శంకుస్థాపనకు ప్రొటోకాల్ ప్రకారం ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఎందుకు సమాచారం ఇవ్వలేదంటూ ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు ఆర్అండ్‌బీ ఏఈ రమేష్ ప్రశ్నించారు. ఎంఈఓ దుర్గదేవి మాట్లాడుతూ మండలానికి 16 మోడల్ స్కూళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మోడల్ స్కూల్ పేరుతో విద్యార్థులను విద్యకు దూరం చేయవద్దంటూ జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్ గోపాల్ హితవు పలికారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు పాలమూరి బాలకష్ణ, అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంపీడీవో బాబ్జీ రాజు, సర్పంచ్ పెనుమాల సునీత, సర్పంచ్‌లు, ఎంపీటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- అరకొర తాగునీటి సరఫరాపై మరోసారి ధ్వజమెత్తిన కౌన్సిలర్లు
- పంట కాలువ నీటి కలుషితంపై ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆందోళన



సమావేశాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నిర్మల్‌కుమార్, అధికారులు



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: అమలాపురం పంట కాలువపై ఒకేసారి రెండు వంతెనల నిర్మాణంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెతో పట్టణంలో తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని పాలకపక్ష కౌన్సిలర్లు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో గత నెల మాదిరిగానే తాగునీటి సమస్యలపై పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ పట్టణంలో వంతెనల నిర్మాణం వల్ల తాగునీటి సమస్యలు ఉత్పన్నమైన విషయాన్ని అంగీకరిస్తూ ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అయినప్పటికీ కౌన్సిలర్లు సంతృప్తి చెందకుండా తాగునీటి సమస్యకు ముఖ్యంగా పంట కాలువపై రెండు వంతెనలు నిర్మిస్తున్నప్పుడు, ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మెలో ఉన్నప్పుడు పంట కాలువల నుంచి మూడు మున్సిపల్ రిజర్వాయర్లను రా వాటర్‌తో నింపే బాధ్యత అధికారులపై ఉందని పాలక పక్షం కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని ప్రశ్నించారు. తాగునీరు అందక ఆయా వార్డుల ప్రజలు నిలదీస్తున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, యేడిద శ్రీను, పిండి అమరావతి, తిక్కా సత్య లక్ష్మి తమ తమ వార్డులో తాగునీటి సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకుని వచ్చారు.

పంట కాలువల నీరు కలుషితం

పట్టణం మీదుగా ప్రవహించే పంట కాలువకు కొందరు తమ ఇళ్ల మరుగు దొడ్ల గొట్టాలు అమర్చి గోదావరి జలాలను కలుషితం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆందోళన వ్యక్తం చేశారు. పంట కాలువలోకి పెట్టిన మరుగు దొడ్ల గొట్టాలను వెంటనే తొలగించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రధాన రోడ్ల మధ్యలో డివైడర్లలో ఆహ్లాదాన్ని పంచే మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు ఎప్పుడు, ఎక్కడ చూస్తున్నారో ఎవరికీ తెలియడం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డ్రెయిన్లలో పూడికల తొలగింపు ఏది ?

పట్టణంలో గతంలో రూ.20 కోట్లతో చేపట్టిన తాగునీటి ప్రాజెక్ట్ పూర్తయితేనే పట్టణంలో పూర్తి స్థాయి తాగునీటి సరఫరా సాధ్యమవుతుందని మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ సమావేశంలో స్పష్టం చేశారు. ఆ రూ.20 కోట్ల ప్రాజెక్ట్‌లో ఇప్పటికే గాంధీనగర్‌లో భారీ ఓహెచ్ఆర్ నిర్మాణం పూర్తయిందని, ఇక ఏవీఆర్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మించాల్సిన ఓహెచ్ఆర్‌లు నిర్మాణం పూర్తి కాలేదని కౌన్సిలర్ బులినాని, నాగేంద్ర గుర్తు చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద దాదాపు రూ.3 కోట్లతో గత ప్రభుత్వంలో నిర్మించిన మల్టీ పర్పస్ భారీ షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎందుకు ప్రారంభించడం లేదని కౌన్సిలర్ నాగేంద్ర ప్రశ్నించారు. 29వ వార్డులో మున్సిపాలిటీ స్థలంలో పాడు బడ్డ నుయ్యిను పూడ్చివేసి ఏదైనా కమ్యూనిటీ అవసరాలకు ఆ స్థలం కేటాయించాలని కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ కోరారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఖాళీ అయిన షాపులను లీజుకు ఇచ్చే అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు సమావేశం దానిపై సీరియస్‌గా చర్చించింది. కొత్తగా లీజుకు ఇచ్చే షాపులకు డిపాజిట్లు, సాల్వెన్సీలు లేకుండా ఇవ్వవద్దని కౌన్సిలర్ నాగేంద్ర రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మికి సూచించారు. మరో వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ కూడా పలు అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.

పీఎంఎంఎస్‌వైలో రుణాల మంజూరు

యానాం: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ద్వారా లబ్ధిదారులకు 60 శాతం సబ్సిడీ ద్వారా పలు పథకాలు మంజూరు చేస్తున్నట్లు పుదుచ్చేరి మత్స్యశాఖ డైరెక్టర్ ఇస్మాయిల్ తెలిపారు. యానాం నియోజకవర్గ పరిధిలోని సావిత్రినగర్ తీరప్రాంతానికి చెందిన కర్రి బేబీ, స్వామి భార్యాభర్తలకు 50 టన్నుల సామర్థ్యంగల ఐస్ ప్లాంట్ నిర్మాణానికి 60 శాతం సబ్సిడీపై రూ.29,77,939, గిరియాంపేటకు చెందిన కర్రి కౌశలయ్య, యేసుకు చేపల విలువ ఆధారిత పరిశ్రమ స్థాపనకు 60 శాతం సబ్సిడీపై రూ.23,33,030 మత్స్యశాఖ ద్వారా రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రెండు యూనిట్లను మత్స్యశాఖ డైరెక్టర్ ఇస్మాయిల్ సమక్షంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ప్రాజెక్టు ఆఫీసర్ మీరాసాహెబ్, జి శివప్రగాశమ్, ఏడీ దడాల గొంతియ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ సూర్యప్రకాషరావు

అమలాపురం రూరల్: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలకు కేటాయించిన 25 శాతంలో సీట్లకు ఎంపికైన విద్యార్థులను చేర్చుకోవాలని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉపవిద్యాశాఖ అధికారి సూర్యప్రకాష్ రావు హెచ్చరించారు. అమలాపురంలోని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులను చేర్చుకోవడం లేదని తల్లిదండ్రులు డీఈవోకు ఫిర్యాదు చేసారు. దీనిపై ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఈఓలతో శుక్రవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అమలాపురం పట్టణ మండల పరిధిలో రెండు విడతలుగా 234 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. వీరిలో అందురూ ప్రైవేట్ పాఠశాలల్లో చేరానని తెలిపారు. విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. పాఠశాలలో చేర్పించిన విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం, పరీక్ష, ల్యాబ్ ఫీజులు తల్లిదండ్రులు చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోఎస్, దుర్గదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు మృతికి సంతాపం

తాళ్లరేవు: యానాం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యర్రా లక్ష్మణరావు మృతి వ్యవసాయ రంగానికి తీరనిలోటని కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన తాళ్లరేవులో మాట్లాడుతూ లక్ష్మణరావు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా విశేష సేవలందించారని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

దివ్యాంగుల ఉద్యమ సారథి హెలెన్ కెల్లర్

యానాం: వికలాంగుల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ సారథి రచయిత్రి హెలెన్ కెల్లర్ జీవితం ఆదర్శనీయమని ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ సెంటర్ ఇన్‌చార్జి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం హెలెన్ కెల్లర్ 145వ జయంతిని స్థానిక రాజీవ్ బీచ్ పరిధిలో ఉన్న మానసిక దివ్యాంగ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యానాం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సహదేవరాజు హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎస్ వీరాస్వామి, ఫిజియో విజయదుర్గ, టీచర్లు సుశీల,వీరవేణి, గీత, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ సేవలు ఆదర్శనీయం

తాళ్లరేవు: అవయవ లోపాలను అధిగమించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన ప్రపంచ శక్తివంతమైన మహిళ హెలెన్ కెల్లర్ జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని రిలయన్స్ సీఎస్ఆర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక రిలయన్స్ ధీరూబాయి ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో ఇన్‌చార్జ్ ఎంటీ గోపాలరావు అధ్యక్షతన హెలెన్ కెల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫిజియోథెరపిస్ట్‌లు శ్రీకాంత్, సత్తిబాబు, సిబ్బంది స్టీఫెన్, ఉదయకుమారి, నాగమణి పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిరోధక చట్టంపై సదస్సు

యానాం: బాల్యవివాహాల నిరోధక చట్టంపై అందరికీ అవగాహన అవసరమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ అధికారి సూరంపూడి రాజేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో 8, 9 తరగతులు చదువుతున్న బాలికలకు హెల్ప్‌లైన్ ఆవశ్యకత, పలు చట్టాలను వివరించారు. కోఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ ఉచిత టోల్‌ఫ్రీ నంబరు 1098, యానాం చైల్డ్‌హెల్ప్ లైన్ 0884-2951098 నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందాలని ఆయన వివరించారు.

అన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు గురువారం భక్తుడు విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఐ.శ్రీనివాస రామచంద్రరావు దంపతులు రూ.పది వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం కలిప్యించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి. సత్యనారాయణ దాతను అభినందించారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

సాక్షి, అమలాపురం: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పడి జులై 1 తేదీ నాటికి 70 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఎస్‌బీఐ అమలాపురం రీజినల్ బిజినెస్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం యెండూరి బ్లడ్ బ్యాంకు బ్యాంకు ఉద్యోగులు ఖాతాదారులతో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి పైగా ఉద్యోగులు రక్తదానం చేశారు. జిల్లాలో రాజోలు, అమలాపురం రెండు చోట్ల ఈ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్టు రీజినల్ మేనేజర్ అశోక్ నాగరాజన్ తెలిపారు.

మంత్రి సాయిశరవణన్ రాజీనామా



మాట్లాడుతున్న సాయిశరవణన్

యానాం: పుదుచ్చేరి ఆది ద్రావిడ శాఖ సంక్షేమ మంత్రి సాయిశరవణన్‌కుమార్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు సీఎం రంగసామికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ముగ్గురు బీజేపీ నామినేటెడ్ ఎమ్మెల్యేలు రామలింగం, వెంకటేషన్, అశోక్‌బాబు తమ రాజీనామాలను స్పీకర్ ఆర్ సెల్వం సమక్షంలో అసెంబ్లీ కార్యదర్శి దయాళన్‌కు అందజేశారు. 2021లో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పట్లో బీజేపీకి రెండు మంత్రి పదవులు, స్పీకర్ పదవిని కేటాయించారు. ఈ నేపథ్యంలో మరో 8 నెలల్లో 2026 మార్చిలో పుదుచ్చేరి అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బీజేపీని పుదుచ్చేరిలో మరింత పటిష్టవంతం చేయాలని అధిష్టానం సూచన మేరకు శుక్రవారం ఆ పార్టీ ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ సురేనా అధ్యక్షతన 2 గంటలపాటు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హోం మంత్రి నమశ్శివాయ, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి హాజరై మంత్రి రాజీనామా, నామినేటెడ్ ఎమ్మెల్యేల రాజీనామాలపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో తక్షణం మంత్రి సాయిశరవణన్, ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేల రాజీనామాలు చేశారు. రాజీనామా చేసిన మంత్రి సాయిశరవణన్ స్థానంలో మరో బీజేపీ ఎమ్మెల్యే జాన్‌కుమార్‌ను మంత్రిగా నియమించనున్నారు. నామినేటెడ్ ఎమ్మెల్యేలుగా జీఎన్ఎస్ రాజశేఖర్, దీప్పయంతన్, ముదలియార్ సెల్వంను నియమించనున్నారని సమాచారం. సాయిశరవణన్‌కు బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించనున్నారని భావిస్తున్నారు.

రాజీనామాలకు ఆమోదం

పుదుచ్చేరి ఆది ద్రావిడ సంక్షేమ మంత్రి సాయిశరవణన్‌కుమార్ తనకు సమర్పించిన రాజీనామా లేఖను ఎల్జీ కైలాసనాథన్ ఆమోదించారని శుక్రవారం సీఎం రంగసామి విలేకరులకు తెలిపారు. అంతకుముందు రాజ్‌నివాస్‌లో రంగసామి ఎల్జీ కైలాసనాథన్‌తో సమావేశమయ్యారు. ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ సమక్షంలో అసెంబ్లీ కార్యదర్శి దయాళన్ ఆమోదం తెలపడంతో ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసారు.